https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 84 గురువారం 30-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## ఈ-20తో వాహనాలకు పెద్దగా సమస్యల్లేవ్

**పాత బళ్లలోనూ ఇంజిన్ మార్చకుండానే వాడుకోవచ్చు**

**సమగ్ర అధ్యయనాల తర్వాతే చెబుతున్నాం: నితిన్ గడ్కరీ**



**న్యూఢిల్లీ, జూలై 29:**
ఈ-20 పెట్రోల్ వాడటం వల్ల వాహనాల పనితీరు, మన్నికలో గణనీయమైన సమస్యలు ఏమీ ఉత్పన్నం కావని సమగ్ర అధ్యయనాల్లో గుర్తించినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పాత తరం వాహనాల్లో సైతం ఇంజిన్‌లో మార్పులు చేయాల్సిన అవసరం లేకుండానే ఈ-20 పెట్రోల్ వాడుకోవచ్చని నొక్కి చెప్పింది. ఈ-20 పెట్రోల్‌పై సభ్యులు వ్యక్తం చేసిన ఆందోళనలకు కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖల మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం రాజ్యసభలో ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ-20 వల్ల వాహనం నడపడంలోగానీ, స్టార్ట్ చేయడంలోగానీ ఇబ్బందులు రావని, వాహనంలోని లోహ, ప్లాస్టిక్ భాగాలకు సైతం నష్టం కలగదని అధ్యయనాల్లో తేలినట్టు చెప్పారు. మైలేజీ అనేది ఎలాంటి ఇంధనం అనేదానిపైనే కాకుండా అనేక ఇతర కారణాలపైనా ఆధారపడి ఉంటుందని ఆటోమొబైల్ తయారీదారులు, వాహనాల టెస్టింగ్ ఏజెన్సీలు స్పష్టం చేసినట్టు గడ్కరీ వివరించారు. ఐవోసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్), ఐఐపీ(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం), ఎస్ఐఏఎం(భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం-డెహ్రాడూన్), ఏఆర్ఏఐ(ఆటోమోటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సంయుక్తంగా అధ్యయనం నిర్వహించి ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు ఈ-20 పెట్రోల్ వాడటం వల్ల నష్టంలేదని నిర్ధారించినట్టు తెలిపారు.

## యాదాద్రిపై పార్టీతో చర్చిస్తే బాగుండేది



**న్యూఢిల్లీ, జూలై 29:**
యాదగిరిగుట్ట దేవస్థానం పాలకమండలి ఏర్పాటుపై ప్రభుత్వ పెద్దలు పార్టీతోనూ చర్చిస్తే బాగుండేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. 'యాదగిరిగుట్ట దేవస్థానాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రైవేట్ భాగస్వామ్యం ఉంటే వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నది సీఎం ఆలోచన కావచ్చు. ఆయన ఆలోచనను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. అయితే, పాలకమండలి కమిటీ ఏర్పాటు కోసం పార్టీతోనూ చర్చించి ఉంటే బాగుండేది' అని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం మధ్య మెరుగైన సమన్వయం కోసం ఇకపై 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. పీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసిన నాలుగు నెలల తర్వాత కమిటీ తొలి సమావేశం బుధవారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగింది. ఇందులో సీఎం రేవంత్, మహేశ్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సమాశానికి కేసీ వేణుగోపాల్ అధ్యక్షత వహించాల్సి ఉండగా పార్లమెంటు సమావేశాల్లో ఆయన బిజీగా ఉండటంతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షత వహించారు. గంటన్నరపాటు సాగిన సమావేశంలో రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వం మధ్య మరింత సమన్వయం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లో అనుసరించాల్సిన వ్యూహాలు, రాబోయే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలపై చర్చించారు.

## పాలమూరు, సీతమ్మ సాగర్‌కు లైన్ క్లియర్

### పర్యావరణ అనుమతుల సాధనకు మార్గం సుగమం

**2017 మినహాయింపు నోటిఫికేషన్ చెల్లుబాటుకు సుప్రీం ఓకే**

**పనులు ప్రారంభించిన తర్వాతా అనుమతులు పొందవచ్చు**

**భవిష్యత్తులో మాత్రం ముందస్తు అనుమతులు తప్పనిసరి**

**2021 నాటి 'పోస్ట్ ఫ్యాక్టో' ఆఫీస్ మెమోరాండం చెల్లదు**

**కార్యనిర్వాహక ఉత్తర్వులతో చట్టాలను దాటవేయలేరు**

**సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. మంత్రులు ఉత్తమ్, తుమ్మల హర్షం**



**హైదరాబాద్, జూలై 29**
రాష్ట్రంలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బ్యారేజీ, డిండి ఎత్తిపోతల పథకం, గౌరవెల్లి రిజర్వాయర్‌ల పర్యావరణ అనుమతులు పొందడానికి మార్గం సుగమమైంది. ముందస్తు పర్యావరణ అనుమతులు (ఈఐ) లేకుండా పనులు ప్రారంభించిన ప్రాజెక్టులు.. ఆ తరువాత అనుమతులు పొందే విషయంలో సుప్రీంకోర్టు వెసులుబాటు కల్పించింది. ఇందుకు సంబంధించి 2017 నాటి మినహాయింపు నోటిఫికేషన్ చెల్లుబాటును సమర్థించింది. అయితే భవిష్యత్తులో ఇలాంటి పరిపాలన ఉత్తర్వులు ఇవ్వకుండా కేంద్రంపై నిషేధం విధించింది. ఈ మేరకు ప్రాజెక్టు పనులు ప్రారంభించిన తర్వాత అనుమతులు (ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో) మంజూరు చేసేందుకు వీలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం (ఓఎం)ను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986, ఈఐఏ నోటిఫికేషన్-2006ను దాటవేస్తూ.. నిరంతరం అమల్లో ఉండేలా ఇటువంటి మినహాయింపు విధానాన్ని తీసుకొచ్చే అధికారం కార్యనిర్వాహక వర్గానికి లేదని తేల్చి చెప్పింది. తొలుత పర్యావరణ అనుమతులు తీసుకున్నాకే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని స్పష్టం చేసింది. 'వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సీజేఐ, జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. అయితే, ముందస్తు అనుమతి పొందే నిబంధనే ప్రాథమికమైనప్పటికీ.. అత్యంత అరుదైన, తీవ్రమైన ప్రజాప్రయోజనాలు ముడిపడి ఉన్న పరిస్థితుల్లో చట్టంలోని సెక్షన్ 3 కింద పరిమిత కాలానికి ప్రత్యేక మినహాయింపు నోటిఫికేషన్లు జారీ చ్ఛస అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుందని పేర్కొంది.

## ఎడతెరిపి లేని వర్షం



**సిరిసిల్ల, జూలై 29 :**
ఎల్‌నినో ప్రభా వంతో కరువు పరిస్థి తులను ఎదుర్కొంటున్న రైతుల్లో వర్షానందం కలిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు రోజులు గా ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పత్తి, మొక్కజొన్న వంటి ఆరు తడి పంటలకు జీవం వచ్చింది. వర్షాకాలం ప్రారంభమై 50 రోజులు దాటి నా సమృద్ధిగా వర్షం లేక మందకొడిగా సాగుతున్న వరి నాట్లు కురుస్తున్న వర్షాలకు జోరు పెరిగింది. మరోవైపు జిల్లాలోని చిన్నచిన్న ఒర్రెలు పారుతు న్నాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. జిల్లా లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు సరాసరి 46.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేము లవాడ రూరల్‌లో 34.3 మిల్లీమీటర్లు, బోయిన్‌పల్లిలో 32.0 మిల్లీమీటర్లు, వేములవాడలో 27.0 మిల్లీమీటర్లు, ఇల్లంతకుంటలో 26.5 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 25.0 మిల్లీమీటర్లు, చందుర్తిలో 23.8 మిల్లీమీటర్లు, సిరిసిల్ల లో 21.3 మిల్లీమీటర్లు, తంగళ్ళపల్లి లో 19.5 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 19.0మిల్లీమీటర్లు, రుద్రంగిలో 15.8మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 12.8 మిల్లీమీటర్లు, వీర్నపల్లిలో 11.5 మిల్లీమీటర్లు, గంభీరావుపేటలో 0.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని ఎగువ మానేరు ప్రాజెక్టులోకి పాల్వంచ వాగు నుంచి వరద నీరు వస్తోంది. జిల్లాలోని ప్రధానమైన మిడ్ మానేరు ప్రాజెక్టులోకి మానేరు, మూలవాగుల నుంచి 4556 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది.

## ఈ-కేవైసీకి రెండు రోజులే

**కరీంనగర్, జూలై 29**
రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. రేషన్ కార్డుల్లో పేర్లున్న సభ్యులంతా తప్పనిసరిగా చౌక ధరల దుకాణాలకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలి. నకిలీ కార్డుల ఏరివేతతో పాటు మరణించిన కుటుంబ సభ్యుల పేర్లు కార్డుల్లో తొలగించడంలో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టారు. ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గడువు రెండు రోజులే ఉండగా రేషన్ దుకాణాలు మూసి ఉండటంతో కార్డుదారులు ఆందోళన చెంతున్నారు. ఇంకా చాలా మంది ఈ-కేవైసీ చేయించుకోలేక పోయారు. డీలర్లు దుకాణాలు తెరిచి ఉంటే తప్ప వంద శాతం ఈ-కేవైసీ వందశాతం పూర్తి కాదు. ఆధార్ అప్‌డేట్ లేనివారికి ఈ-కేవైసీ కావడం లేదు. దీంతో జనం ఆధార్ కేంద్రాల వద్దకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వం ఈ-కేవైసీని మరికొన్ని రోజులు పొడిగించాలని రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు.

## బలమైన కూటమికి బొద్దింకల ప్రణాళిక!

**మోదీ సర్కారుకు వ్యతిరేకంగా విస్తృత కూటమి**

**రైతులు, యువత, విద్యార్థులతో కలసి ఉద్యమిస్తాం**

**సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రంకా**

**రైతు నేత రాకేశ్ టికాయత్‌తో సీజేపీ నేతల సమాలోచనలు**



న్యూఢిల్లీ, జూలై 29: రైతులు, యువత, విద్యార్థులతో విస్తృత కూటమిని ఏర్పాటు చేసి, కేంద్రంలోని మోదీ సర్కారుకు వ్యతిరేకంగా మలి విడత ఉద్యమానికి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సమాయత్తమవుతోంది. ప్రముఖ రైతు నేత రాకేశ్ టికాయత్‌తో సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా తదితరులు బుధవారం ఢిల్లీలో సమాలోచనలు నిర్వహించారు. భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) సభ్యులు కూడా ఇందులో పాల్గొన్నారు. విద్యార్థులపై కేసుల ఉపసంహరణ విషయంలో టికాయత్ మద్దతును ఈ సందర్భంగా సీజేపీ కోరింది. సమావేశం అనంతరం అశుతోష్ రంకా మీడియాతో మాట్లాడుతూ.. రైతు సోదరులు, యువత, విద్యార్థులతో పెద్ద కూటమి కట్టి, అన్ని వైపుల నుంచి మోదీ సర్కారుకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఇటీవలి నిరసనల సమయంలో విద్యార్థులపై నమోదైన కేసులను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, అవమాన పూరిత, పరువుకు భంగం కలిగించే కంటెంట్‌ను తొలగించాలంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'కు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని సీజేపీ తప్పుబట్టింది. పాలకులను ప్రశ్నించే హక్కు పౌరులకు ఉంటుందని పేర్కొంది.

## ప్రియాంక క్షమాపణలు చెప్పాలి

**నిరాధార ఆరోపణలు చేసిన ఆమెను బహిష్కరించాలి**

**లోక్‌సభ స్పీకర్‌కు కేంద్ర మంత్రి జోషి ఫిర్యాదు**



**న్యూఢిల్లీ, జూలై 29:**
కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కాంగ్రెస్ నేత ప్రియాంకపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో విద్యాశాఖను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించడంపై కాంగ్రెస్ నేతలు ప్రియాంక, రాహుల్ తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ప్రహ్లాద్ జోషి ఇటీవల రేపిస్టులను వెనకేసుకొచ్చారని, అలాంటి వ్యక్తికి ప్రధాని మోదీ విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారని ఆరోపించారు. దీనిపై బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లోక్‌సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జోషి స్పందిస్తూ.. ప్రియాంక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇష్టానుసారం మాట్లాడడం సరికాదని, ఆమె ఆరోపణలను తిరస్కరిస్తున్నానని చెప్పారు. ఆమెను సభ నుంచి బహిష్కరించాలని, తప్పనిసరిగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన స్పీకర్ చాంబర్‌కు వెళ్లి, ప్రియాంకపై ఫిర్యాదు చేశారు. ప్రియాంక కూడా తన వ్యాఖ్యలకు ఆధారాలు ఉన్నాయంటూ స్పీకర్‌కు తెలియజేసినట్లు సమాచారం. కాగా విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీకి సంబంధించి తాను అన్నీ నిజాలే చెప్పానని, తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు.

# రైతన్న మెడకు కాంగ్రెస్ 'స్మార్ట్' ఉరితాడు!



తెలంగాణ గడ్డపై మరోసారి విద్యుత్తు పోరాట మేఘాలు కమ్ముకుంటున్నాయి. నాడు బషీర్‌బాగ్‌లో గుర్రపు స్వారీలతో ప్రజల గొంతు నొక్కిన పాలకులు ఏమయ్యారో కాలం చెప్పింది. నేడు కేంద్రం తెచ్చిన రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్) ఒప్పందంపై ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రజా కంటక కాంగ్రెస్ ప్రభుత్వం సంతకం చేయడం తెలంగాణ ఆత్మగౌరవానికి, రైతుల ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు. ఇది కేవలం సాంకేతిక మార్పు కాదు.. సామాన్యుడి ఇంట్లో వెలుగును ఆర్పే, కార్పొరేట్ సంస్థల ఖజానా నింపే ఒక వ్యవస్థీకృత కుట్ర. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా, రూ.30,000 కోట్ల నిధులు ఆశ చూపినా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్‌లో చేరడానికి నిరాకరించింది. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం అంటే అది రైతు మెడకు ఉరితాడు అని కేసీఆర్ భావించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో తలపడిన ఆనాటి వైఖరిని నేడు విస్మరించడం రేవంత్‌రెడ్డి సర్కార్ చేస్తున్న చారిత్రక తప్పిదం. గణంకాలతో కూడిన చేదు నిజాలు: స్మార్ట్ మీటర్ల భారం: సాధారణ మీటర్ ధర రూ.800 – రూ.1000 ఉంటే, స్మార్ట్ మీటర్ పేరుతో ఒక్కో వినియోగదారుడిపై రూ.7,000 నుంచి రూ.14,000 వరకు భారం మోపుతున్నారు. రాష్ట్రంలోని 1.78 కోట్ల కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అంటే వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము అదానీ, అంబానీ వంటి సంస్థల జేబుల్లోకి వెళ్తున్నది. ప్రీపెయిడ్ సంకెళ్లు: ఫోన్ రీచార్జ్ లాగా విద్యుత్తు రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్తు దీపం వెలుగుతుంది. రీచార్జ్‌లో నిమిషం ఆలస్యమైనా పేదలు, మధ్యతరగతి ప్రజలు అంధకారంలో మగ్గాల్సిందే. వ్యవసాయ రంగానికి ముప్పు: తెలంగాణలో సుమారు 29 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మీటర్లు పెడితే వచ్చే 24 గంటల ఉచిత విద్యుత్తుకు గండి పడుతుంది. సబ్సిడీని నగదు బదిలీ (డీబీటీ) చేస్తామనడం కంటితుడుపు చర్యే. గ్యాస్ సబ్సిడీ లాగే ఇది కాలక్రమేణా మాయం కావడం ఖాయం. ప్రజాప్రభుత్వం తీసుకొస్తామంటూ ఎన్నికల్లో ప్రచారం చేసి గెలిచిన కాంగ్రెస్ గెలిచిన తర్వాత ప్రజల ప్రాథమిక అవసరమైన విద్యుత్తును కార్పొరేట్లకు తాకట్టు పెట్టడం వల్ల ఆ పార్టీకి క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత తప్పదు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు) పథకానికి కూడా ఈ స్మార్ట్ మీటర్ల 'సర్వీస్ ఛార్జీలు' తూట్లు పొడుస్తాయి. హెచ్చరిక: తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. విద్యుత్తు బిల్లులు ఆందోళనలకు దారి తీస్తే, అది కాంగ్రెస్ సర్కార్ పతనానికి దారితీస్తుంది. ఇది కేవలం ఒక విధానం కాదు, ఒక జనచైతన్య ఉద్యమానికి పునాది. కాంగ్రెస్ సర్కార్ తెస్తున్న స్మార్ట్ సంస్కరణలు రైతుల పొలాల్లో చిచ్చు పెడితే, అదే చిచ్చు అధికార అహంకారాన్ని దహించక మానదు. ఇదే విషయాన్ని పాలకులు గుర్తుంచు కోవాలి.. హితవు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డీఎస్ఎస్ ఒప్పందం నుంచి తప్పుకోవాలి. మౌలిక సదుపాయాల మెరుగుదల పేరుతో ప్రజల రక్తం పిండటం మానుకోవాలి. లేనిపక్షంలో, తెలంగాణ మరోసారి విద్యుత్తు ఉద్యమానికి వేదిక కావడం ఖాయం.

## చీరలు, హాట్‌బాక్స్‌లు తిరిగిచ్చేయాలని ఒత్తిడి..

### ఓటర్లు ఎదురుతిరగడంతో వెళ్లిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి



మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని తట్టుకోలేక ఓ కాంగ్రెస్ అభ్యర్థి ఓటర్ల ఇంటికి వెళ్లి హల్‌చల్ చేశారు. ఎన్నికల ముందు పంచిన డబ్బులు, చీరలు, హాట్‌బాక్స్‌లు తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ఓటర్లు ఎదురు తిరిగారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో యాదాద్రి భువనగిరి మున్సిపాలిటీలోని ఒకటో వార్డు నుంచి స్వరూపరాణి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. దీంతో ఓటమిని తట్టుకోలేక కాంగ్రెస్ అభ్యర్థి కుటుంబసభ్యులు ఓటర్ల ఇళ్లకు వచ్చి హల్‌చల్ చేశారు. పంచిన డబ్బులు, చీరలు, హాట్‌బాక్స్‌లు రిటర్న్ ఇవ్వాలని ఓటర్లపై ఒత్తిడి తీసుకొచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి కుటుంబసభ్యుల తీరుతో విసుగెత్తిపోయిన ఓటర్లు మూకుమ్మడిగా ఎదురించారు. మిమ్మల్ని ఎవరు ఇవ్వమన్నారని ఎదురు తిరిగి ప్రశ్నించారు. దీంతో సమాధానం చెప్పలేక స్వరూపరాణి, ఆమె కుటుంబసభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎన్నికల్లో ఓడిపోయినందుకు పంచిన డబ్బులు, చీరలు ,హాట్ బాక్స్‌లను తిరిగి ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి హల్చల్ యాదాద్రి భువనగిరి మున్సిపాలిటీలోని ఎన్నికల్లో ఒకటవ వార్డులో ఓడిపోయినందుకు తాను పంచిన డబ్బులు, చీరలు ,హాట్ బాక్స్‌లను తిరిగి ఇవ్వాలని ఓటర్ల ఇళ్లపైకి...

## మగవారితో అన్నింట్లో సమానంగా ..

# మహిళా మణులు

### తాపీమేస్త్రి గా ఎదిగిన గృహిణిలు

### బిల్డింగులు కట్టడంలోనూ సత్తాబి చాటుతున్న మహిళలు

చేసి చూపెడుతున్నారు మన వరంగల్ ఆడబిడ్డలు. ఒకప్పుడు బిల్డింగులు కట్టడమంటే అంతా మగవాళ్లపనే అనుకునేటోళ్లు. కానీ, ఇప్పుడు మన వరంగల్ సిటీల ఎటు చూసినా ఇండ్లకాడ, అపార్ట్‌మెంట్లకాడ గంపలు ఎత్తుకొని, తాపీలు పట్టుకొని ఆడోళ్లే కనిపిస్తున్నారు. చేసే పనిల కూడా తామేం తక్కువ కాదు అని నిరూపిస్తున్నారు.



**కూలీ పని నుంచి మేస్త్రీ దాకా.. అంతా మనోళ్లే!**

గతంలో ఆడోళ్లు బిల్డింగ్ కాడికి పోతే ఒట్టిగనే ఇటుకలు ఇయ్యడం, సిమెంట్ గంపలు మోయడం లాంటి కూలీ పనులకే పరిమితమయ్యేటోళ్లు. కానీ, ఇప్పుడు వరంగల్ జిల్లా కథ మారింది. మగవాళ్లకు పోటీగా సిమెంట్ ప్లాస్టరింగ్ చేయడం, గోడలు కట్టడం లాంటి పనులను కూడా నేర్చేసుకొని "ఆడ మేస్త్రీలు"గా ఎదిగి. మగవాళ్లతో సమానంగా తాపీ పట్టి గోడలు లెవెల్ చేస్తుంటే చూసేటోళ్లు అబ్బురపడాల్సిందే.

**పెరిగిన ఆడోళ్ల సంఖ్య - చేతి నిండా పైసలు**

వరంగల్ సిటీ ఇప్పుడు గిర్రున తిరుగుతూ పెద్ద పెద్ద బిల్డింగులతో ఉరుకులు పరుగులు పెడుతోంది. అందుకే ఇక్కడ కన్‌స్ట్రక్షన్ పనులు గట్టిగ నడుస్తున్నాయి. దీన్ని ఆసరా చేసుకొని వేలాది మంది ఆడోళ్లు ఈ రంగంలోకి దిగుతున్నారు.ఎండనక, వాననక కష్టపడుతూ.. వచ్చే సంపాదనతో పిల్లలను మంచి బడులల్ల చదివించుకుంటున్నారు.ఎవరి మీద ఆధారపడకుండా: మొగుడి సంపాదన కు తానున్నానని తోడవుతున్నారు, తాము కూడా సంపాదిస్తూ ఇల్లు గడవడంలో యజమానికి తోడు అవుతున్నారు. ఇంట్ల ఏ నిర్ణయమైనా ధైర్యంగా చెప్తున్నారు.

**ఆఖరుకు చెప్పేదేందంటే:**

కష్టం ఏదైనా, రంగం ఏదైనా ఆడోళ్లు అడుగుపెడితే అక్కడ జెండా పాతాల్సిందేనని మన వరంగల్ ఆడబిడ్డలు నిరూపిస్తున్నారు. ఇండ్లకు పునాదులు వేస్తూ, గోడలు కడుతూ.. వరంగల్ సిటీని అందంగా ముస్తాబు చేస్తున్న ఈ నవసమాజ నిర్మాణ మహిళ శిల్పులకు గట్టిగ ఒక సలాం కొట్టాల్సిందే! తరాలు మారుతున్న ఆడవాళ్ళ తలరాతలు మారలేదనేది ఇక నిజం కాదని నిరూపిస్తున్న మహిళలోకం.

**సీనియర్ జర్నలిస్టు**
**బోడకుంట్ల శ్రీనివాస్**
**ఫోన్ నంబర్ 9000738780**

# పులిని బతకనివ్వండి!



అటవీ ప్రాణుల్ని చంపి తింటుంటే పులులకు తినడానికి తిండి లేక సంచారం మొదలుపెట్టాయి. ఆహార పిరమిడ్‌లో పై భాగంలో పులి ఉంటుంది, అది బతికితేనే అడవి చల్లగా ఉంటుంది, అడవిలో సమతుల్యత ఉంటుంది... పర్యావరణం నిలబడుతుంది. అలాంటి అడవుల్ని రోజురోజుకూ ధ్వంసం చేస్తూ కొంత మంది ఆ భూముల్ని ఆక్రమిస్తుంటే ఒక మంత్రేమో, ఆ భూములకు పట్టాలిస్తాను అంటాడు! అటవీ శాఖ మంత్రేమో-- అడవులు నరక వద్దంటాడు. ఒకే ప్రభుత్వంలో ద్వంద్వ వైఖరి ఇది. మనం తరచూ చూస్తున్న చోద్యమే! మహారాష్ట్రలోని తడోబా, ముఖ్యంగా తిప్పేశ్వర్ అటవీ ప్రాంతాల వరకు మనం వెళ్లి చూడగలిగితే అక్కడ పెరుగుతున్న రిసార్టులతో పాటు గ్రామాలకు గ్రామాలే అడవిని ఆక్రమిస్తున్న వైనం మనకు కనిపిస్తుంది. తిప్పేశ్వర్ కేవలం 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న చిన్న అడవి. అక్కడ ఈ పెద్దపులులు తలదాచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. నానాటికీ కుంచించుకుపోతున్న అడవితో వాటికి నిలువనీడ లేక ప్రాదేశిక తగాదాలతో వాటిలో అవి పోరాటాలు చేసి, ఓడిన పులులు తాము తల దాచుకునే స్థలం కోసం వలసబాట పడుతున్నాయి. వందల కిలోమీటర్లు ప్రయాణించినా అవి బతకడానికి అడవంటూ మిగిలితే కదా! ఒక పులి 600 కిలోమీటర్లు ప్రయాణించి రాజమండ్రి పరిసరాలకు చేరుకున్న వైనం మీరు వినే ఉంటారు! సురక్షితంగా మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆ పులిని విశాఖ జూకు తరలించిన విషయం విని సంతోషించాను. ఎందుకంటే దాన్ని రక్తం మరిగిన పులి అనో.. ప్రమాదకారి అనో ముద్ర వేసి చంపలేదు. ఇప్పుడు పడుతున్న ఆందోళన అంతా జనగామ, సిద్దిపేట ప్రాంతాల్లో తిరుగుతున్న పులి గురించి. దానినే ఇష్టం వచ్చినట్టు సోషల్ మీడియాలో ప్రమాదకారి అని, రక్తం మరిగిన పులి అని రకరకాలుగా ఆకతాయితనంతో దుష్ప్రచారం చేస్తున్నారు. ఒకసారి ఆ పులిని ప్రమాదకారిగానో లేదా మనుషుల్ని తినేదిగానో ముద్ర వేస్తే దాని కథ ముగిసిపోయినట్టే! మత్తు తూటాతో నిద్రపుచ్చి పెద్దపులిని సంరక్షించాల్సిన చేతులే, దాన్ని పట్టుకోవడం మా వల్ల కాదు అని చేతులెత్తేస్తే... రేపు జరగబోయేది ఇదే!

రక్తం మరిగిన పులి.. క్రూరంగా ప్రవర్తిస్తున్న పులి.. మనుషుల వెంట పడుతున్న పులి.. పశువులను చంపుతున్న పులి.. ప్రమాదకారిగా మారిన పులి... ఇలా రకరకాల పదాలు మనకీమధ్య సోషల్ మీడియాలో బాగా వినిపిస్తున్నాయి. ఈ పదాల వెనక ఎంత వాస్తవం ఉంది? ఒక కుక్కను చంపాలను కున్నప్పుడు దాన్ని పిచ్చిదని ముద్ర వేస్తే చంపడం సులభమవుతుంది. పెద్దపులి పరిస్థితి కూడా ఇలాగే తయారైంద నిపిస్తున్నది. వాటి ఆవాసాలు ధ్వంసమైపోయి అడివంటూ మిగలకపోయేసరికి దిక్కుతోచక వందల కిలోమీటర్లు నడిచి, తలదాచుకునే చోటు కోసం వెతుక్కుంటూ వస్తున్నాయి. తినడానికి తిండి లేక కాలే కడుపుతో అడవిని వెతుక్కుంటూ గ్రామాల వైపు నడిచి వస్తున్నాయి. వాటి ప్రయాణం మధ్యలో తగిలే జనావాసాలు, పంట పొలాలు, మానవ సంచారం... వాటిని మరింత ఆందోళనకు, భయానికి గురిచేస్తున్నాయి. మనిషి శాకాహారం తినగలిగి కూడా రోజూ కోట్ల కొద్దీ కోళ్లు, మేకలను తన ఆహారం కోసం హతమారుస్తున్నాడు. మాంసాహార జీవి అయిన పెద్దపులి మాత్రం ఏం చేస్తుంది?! ఆకలి తీర్చుకోవడానికి, తనకు ఎదురైన జంతువులను వేటాడుతున్నది. తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నది. మనిషి తనకు హఠాత్తుగా ఎదురుపడితేనో లేదా తనకు హాని చేయజూస్తేనో ఆత్మరక్షణార్థం ఎదురు దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నది. రోజురోజుకూ అటవీ విస్తీర్ణం తగ్గిపోతుంటే, అడవులన్నీ పోడుగా మారిపోతుంటే, వేటగాళ్లు అడవిలో ఉచ్చులు పెట్టి విచ్చలవిడిగా

# కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు ఆత్మగౌరవం

బంజారా సమాజానికి ఆధ్యాత్మిక గురువుగా, సామాజిక సంస్కర్తగా పూజ్యనీయుడైన సేవాలాల్ మహారాజ్ జన్మదినం నేడు. సంత్ సేవాలాల్ మహారాజ్ 1739 ఫిబ్రవరి 15న ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని రాంజీనాయక్ తండాలో బంజారా (లంబాడీ) కుటుంబంలో సేవాలాల్ మహారాజ్ భీమానాయక్, ధరమణి మాతా దంపతులకు జన్మించారు. చెర్లోపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లలదొడ్డి సమీపంలో ఆయన పుట్టిన పవిత్ర స్థలం ఉన్నది. సేవాలాల్ మహారాజ్ జన్మస్థలం చుట్టూ ఇప్పుడు 'సేవా గడ్ మఠం' ఉన్నది, దీనిని బంజారాల ఆరాధ్య స్థలంగా కొలుస్తారు. 1806 డిసెంబర్ 4న మహారాష్ట్రలోని రుహిగడ్‌లో సేవాలాల్ మహారాజ్ సమాధి చెందారు. సేవాలాల్ బాల్యంలోనే వేదాలు, శాస్త్రాలు, అనేక భాషల్లో నిపుణుడయ్యారు. ఆయుర్వేదం, నేచురోపతి వంటి వైద్య విద్యల్లో నైపుణ్యం సాధించారు. సమాజంలో వ్యాపించిన మూఢాచారాలు, మంత్రతంత్రాలు, పశు బలులు వంటివాటిని వ్యతిరేకించారు. మానవ సేవే మాధవ సేవ అని చాటి చెప్తూ ఆదివాసీలు, గిరిజన జాతుల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేశారు. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం.. సేవాలాల్ మహారాజ్ హైదరాబాద్‌కు వచ్చి కలరా మహమ్మారిని నిర్మూలించారని, అందుకు గాను నిజాం పాలకులు బంజారాహిల్స్ ప్రాంతంలో సేవాలాల్ పశువుల మేతకు అనుమతి ఇచ్చారని చెప్తారు. ఆయన ఆత్మగౌరవం, సమానత్వం, ప్రకృతి పరిరక్షణ బోధనలు గిరిజన సమాజానికి మార్గదర్శకం. నేడు బంజారా భవన్‌లో జరిగే సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఆయన ఆదర్శాలను స్మరించుకునే అవకాశం. ఆయన జీవితం గిరిజనులు, అటవీ నివాసులు, ఆదివాసీల సేవకు అంకితమైంది. సేవాలాల్ జయంతి సందర్భంగా ఆయన బోధనలు, సేవలు తెలంగాణలో గిరిజనుల సమస్యలు, ప్రభుత్వాల పాత్రలను పరిశీలిద్దాం. సేవాలాల్ మహారాజ్ ఆదర్శాలు నేడు కూడా గిరిజన సమాజానికి మార్గదర్శకం. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన మార్గానికి వ్యతిరేకంగా గిరిజనుల భూములు దోచుకుంటూ, హక్కులు కాలరాస్తూ అణచివేస్తున్నది. ఇది ఒక రాజకీయ దుర్మార్గం మాత్రమే కాదు, గిరిజన సమాజానికి చేస్తున్న ద్రోహం. కేసీఆర్ పాలనలో గిరిజనుల స్వర్ణయుగం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మరో సేవాలాల్ లాంటి దూరదృష్టితో గిరిజనుల సంక్షేమానికి విప్లవాత్మక చర్యలు తీసుకున్నారు. సేవాలాల్ మహారాజ్ ఆదర్శాలకు అనుగుణంగా, గిరిజనుల భూమి, విద్య, ఉపాధి, రిజర్వేషన్ల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించారు.

# పులుల సంరక్షణకు సమిష్టి బాధ్యత

**అంతర్జాతీయ పులుల దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ పిలుపు**

**పులుల పరిరక్షణే ప్రకృతి పరిరక్షణ అన్న మంత్రి**

**తెలంగాణలో పులుల సంఖ్య పెంపునకు చర్యలు**

**విశిష్ట సేవలందించిన అటవీ సిబ్బందికి సత్కారం**







**హైదరాబాద్, జూలై 29**

పులుల సంరక్షణ పట్ల సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల నివాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి ఆవాసమని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులుల ఫోటో ప్రదర్శనను పరిశీలించి, పులుల సంరక్షణపై రూపొందించిన లఘు చిత్రాన్ని వీక్షించారు. సభలో మాట్లాడిన మంత్రి, ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. పులుల సంరక్షణపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. పులి అడవుల ఆరోగ్యానికి ప్రతీక అని, పులులను కాపాడడం అంటే అడవులు, జీవవైవిధ్యం, పర్యావరణం, భావితరాల భవిష్యత్తును కాపాడినట్లేనని పేర్కొన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా కారణంగా పులుల సంఖ్య ఒక దశలో తీవ్రంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పులుల పరిరక్షణ కోసం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1973లో ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించడం ద్వారా దేశంలో పులుల సంరక్షణకు బలమైన పునాది పడిందని మంత్రి తెలిపారు. ఈ చర్యల ఫలితంగానే ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75శాతం భారతదేశంలోనే ఉన్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 58 పులుల అభయారణ్యాలు విజయవంతంగా పనిచేస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా పులుల సంరక్షణలో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా పులుల సంరక్షణలో ప్రత్యేక గుర్తింపు పొందిందని మంత్రి వెల్లడించారు. అమ్రాబాద్, కవ్వాల్ పులుల అభయారణ్యాలు దేశంలోనే ప్రముఖమైనవిగా గుర్తింపు పొందాయని చెప్పారు. అమ్రాబాద్‌లో నీటి వనరుల అభివృద్ధి, ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల కారణంగా పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. కవ్వాల్ పులుల అభయారణ్యంలో పులుల పునరావాస కార్యక్రమాన్ని చేపట్టి, మహారాష్ట్రలోని తడోబా అభయా రణ్యంతో అనుసంధానం చేయడం ద్వారా సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు.ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు అటవీ శాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు మంత్రి తెలిపారు. అడవులను కాపాడడం, వన్యప్రాణులను సంరక్షిం చడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందు తున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన శిక్షణార్థు లను ఉద్దేశించి అటవీ సంపద పరిరక్షణలో నిబద్ధత, నిజాయితీ, సేవాభా వంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణలో విశేష సేవలందించిన అటవీ శాఖ ఉద్యోగులకు మంత్రి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థు లకు కూడా ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్ర మంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్‌తో పాటు పలు వురు ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ఎల్ఐసీ భారీ డివిడెండ్

**రూ.12,207 కోట్ల చెక్కును అందజేసిన ఎల్ఐసీ**

**ప్రభుత్వరంగ బ్యాంకుల లాభాలు, ఆస్తుల నాణ్యతలో రికార్డు పురోగతి**




**న్యూఢిల్లీ, జూలై 29**

కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వరంగ సంస్థల నుంచి భారీ మొత్తంలో డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ఇదే సమయంలో ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రభుత్వరంగ బీమా సంస్థలు కూడా మెరుగైన ఆర్థిక ఫలితాలు నమోదు చేసి ప్రభుత్వ ఆదాయానికి బలాన్నిచ్చాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సతీష్ కుమార్ దొరైస్వామి బుధవారం రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును అందజేశారు. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి సామాజిక మాధ్యమ వేదిక ద్వారా వెల్లడించారు. అలాగే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2,853 కోట్ల డివిడెండ్‌ను, న్యూ ఇండియా అష్యూరెన్స్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి అందజేశాయి.ప్రభుత్వరంగ సంస్థల బలమైన ఆర్థిక పనితీరుకు ఈ డివిడెండ్లు నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వరంగ బ్యాంకులు గత కొన్నేళ్లుగా సంస్కరణలు, సమర్థవంతమైన నిర్వహణ, రుణాల నాణ్యత మెరుగుదలతో స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయని తెలిపింది. దీంతో ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో అధిక ఆదాయం సమకూరుతోందని వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.9 శాతానికి తగ్గి చరిత్రలోనే కనిష్ఠ స్థాయికి చేరింది. మరోవైపు బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరి కొత్త రికార్డు సృష్టించింది. వరుసగా నాలుగో ఏడాది ప్రభుత్వరంగ బ్యాంకులు లాభాలను నమోదు చేయడం విశేషంగా నిలిచింది.ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, ప్రభుత్వరంగ బ్యాంకుల నికర లాభం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. 2026 మార్చి 31 నాటికి ప్రభుత్వరంగ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరి ఏడాది వ్యవధిలో 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.39 శాతానికి తగ్గడం, ప్రతి ప్రభుత్వరంగ బ్యాంకు 90 శాతానికి పైగా నిధుల భద్రత నిష్పత్తిని కొనసాగించడం ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సంకేతంగా ప్రభుత్వం పేర్కొంది. రుణాల మంజూరులో మెరుగైన ప్రమాణాలు, సమర్థవంతమైన నష్టభయ నిర్వహణ, మూలధన బలోపేతం కారణంగా ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలు మరింత బలపడుతున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# 6జీ దిశగా భారత్ అడుగులు..

**భారత్ 6జీ అలయన్స్ పురోగతిపై సమీక్ష**

**5జీ ప్రయోగశాలలకు ప్రతిభా పురస్కారాలు**

**ప్రపంచ స్థాయి సహకారంపై దృష్టి పెట్టాలని సూచన**

**6జీ సాంకేతికతలో అగ్రస్థానమే లక్ష్యమన్న కేంద్రం**

**న్యూఢిల్లీ, జూలై 29 :**

దేశాన్ని 6జీ సాంకేతిక రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా భారత్ 6జీ అలయన్స్ పురోగతిని సమీక్షించి, 5జీ ప్రయోగశాల ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 6జీ రంగంలో భారత్ సాధించాల్సిన లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన దిశలో భారత్ 6జీ అలయన్స్ పనిచేస్తోందని తెలిపారు. ప్రపంచ టెలికాం సాంకేతికత అభివృద్ధిలో భారత్ ముందంజలో నిలిచి, కొత్త ఆవిష్కరణలకు నాయకత్వం వహించే దేశంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.భారత్ 6జీ అలయన్స్ ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సాంకేతిక పురోగతిని నిరంతరం అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. వివిధ కార్యబృందాల మధ్య సమన్వయం, పరస్పర సహకారం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన, ఆవిష్కరణ, ప్రమాణాల రూపకల్పనలో భారత సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 5జీ ప్రయోగశాలలు సాంకేతిక పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయని పేర్కొంటూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రయోగశాలలకు మంత్రి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ ప్రయోగశాలలు విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమల మధ్య అనుసంధానానికి దోహదపడతాయని చెప్పారు. 6జీ సాంకేతికత అభివృద్ధిలో స్వదేశీ పరిశోధన, నవీన ఆవిష్కరణలు, పరిశ్రమల భాగస్వామ్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను కీలక శక్తిగా నిలిపేందుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత్‌ను 6జీ సాంకేతిక రంగంలో ప్రపంచ నాయకత్వ స్థానానికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి పిలుపునిచ్చారు. ప్రపంచ స్థాయి టెలికాం సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో భారత్ కీలక పాత్ర పోషించే దిశగా భారత్ 6జీ అలయన్స్ కృషి కొనసాగిస్తోందని ఆయన పేర్కొన్నారు.

## పాఠశాల భోజనంలో కొత్త ప్రతిపాదన

**మధ్యాహ్న భోజనంలో చికెన్ బిర్యానీ**

**విద్యార్థులకు పౌష్టికాహారమే లక్ష్యం**

**40 లక్షల మందికి ప్రయోజనం**

**పరిశీలనలో ఉన్న ప్రభుత్వ ప్రతిపాదన**



**చెన్నై, జూలై 29**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు తమిళనాడు ప్రభుత్వం కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించే అవకాశంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే దేశంలోనే అత్యంత పురాతనమైన మధ్యాహ్న భోజన పథకంలో ఇది ఒక ముఖ్యమైన మార్పుగా నిలవనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ, మహిళా సాధికారత శాఖతో చర్చలు జరిపిన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరును పెంచడం, పౌష్టికాహార లోపాలను తగ్గించడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. వారానికి ఒకసారి ప్రోటీన్ అధికంగా ఉండే చికెన్ బిర్యానీని అందించడం వల్ల విద్యార్థుల పోషకాహార స్థాయి మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే పాఠశాలల్లో అందించే భోజనం నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా విద్యార్థులకు సరఫరా చేసే బియ్యం నాణ్యతను మరింత మెరుగుపరిచే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. ప్రస్తుతం తమిళనాడులో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న సుమారు 40 లక్షల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు సుమారు 32 లక్షల మంది విద్యార్థులకు ప్రతి రోజు అల్పాహారం అందుతోంది. ఈ రెండు పథకాలు రాష్ట్రంలో విద్యార్థుల పోషకాహారానికి కీలకంగా మారాయి. ఈ పథకాలను పదకొండో, పన్నెండో తరగతుల విద్యార్థులకు కూడా విస్తరించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనివల్ల మరో 8 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందించడం ద్వారా వారి హాజరు శాతం పెరగడంతో పాటు చదువు మధ్యలో మానివేసే వారి సంఖ్య తగ్గుతుందని విద్యా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అయితే వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించే ప్రతిపాదనపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. సంబంధిత శాఖలతో సంప్రదింపులు, ఆర్థిక భారం, అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం ప్రకటించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పోషకాహార పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## జపాన్‌ను వణికించిన భూకంపం

**రిక్టర్ స్కేల్‌పై 7.1 తీవ్రత నమోదు**

**13 మంది మృతి, పలువురి గల్లంతు**

**కూలిన షాపింగ్ మాల్‌లో సహాయక చర్యలు**


**అత్యవసర విపత్తు కేంద్రం ఏర్పాటు**



**టోక్యో, జూలై 29**

జపాన్‌లో మంగళవారం సంభవించిన 7.1 తీవ్రత భూకంపం భారీ విధ్వంసానికి కారణమైంది. దక్షిణ జపాన్‌లోని ప్రధాన ద్వీపమైన క్యుషూలో సంభవించిన ఈ భూకంపం కారణంగా ఇప్పటివరకు 13 మంది మృతిచెందినట్లు జపాన్ ప్రభుత్వం వెల్లడించింది. పలువురు గాయపడగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు సహాయ చర్యలను ముమ్మరం చేశాయి. భూకంప ప్రభావంతో కషిమా పట్టణంలోని ఓ షాపింగ్ మాల్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు నిర్ధారించారు. దెబ్బతిన్న భవన శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయి ఉండొచ్చన్న అనుమానంతో సహాయక సిబ్బంది నిరంతరం గాలింపు చర్యలు చేపడుతున్నారు. ప్రారంభంలో భారీ పేలుడు సంభవించినట్లు సమాచారం రావడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.భూకంపం కారణంగా అనేక ప్రాంతాల్లో భవనాలు దెబ్బతినడంతో పాటు విద్యుత్ సరఫరా, రవాణా సేవలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కూడా నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ తాత్కాలిక సహాయ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. నష్టంపై పూర్తి స్థాయి అంచనాలు కొనసాగుతున్నాయి. పరిస్థితిని సమీక్షించిన జపాన్ ప్రధాని అత్యవసర విపత్తు నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, సంబంధిత మంత్రులతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం, తాగునీటి కొరతను నివారించడం వంటి చర్యలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు.భూకంప ప్రభావిత ప్రాంతాల్లో వైద్య బృందాలు, జాతీయ విపత్తు స్పందన సిబ్బంది, రక్షణ దళాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రత్యేక పరికరాలతో గాలింపు కొనసాగుతోంది. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం జపాన్‌లో తీవ్ర ఉష్ణోగ్రతలు కూడా నమోదవుతున్న నేపథ్యంలో సహాయక చర్యలకు అదనపు సవాళ్లు ఎదురవుతున్నాయి. భూకంప బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భూకంప ప్రభావం, నష్టం, ప్రాణనష్టం వివరాలపై అధికారిక సమాచారం ఎప్పటికప్పుడు నవీకరించబడుతుందని ప్రభుత్వం తెలిపింది.





# ‘బిగ్‌బాస్‌కు నేను సెట్ కాను’..


ఫోక్ సాంగ్స్, డ్యాన్స్ ప్రదర్శనలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఇప్పుడు హీరోయిన్‌గా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. ఇడుపు కాయితం చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతున్న ఆమె పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు వర్క్స్ బ్యానర్లపై నిర్మిస్తుండగా, ప్రియదర్శి హీరోగా నటిస్తున్నారు. ఇందులో నాగదుర్గ ‘శ్రీలత’ అనే తెలంగాణ యువతి పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, ‘ఇడుపు కాయితం’ టైటిల్ కూడా సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో నాగదుర్గ వరుస ఇంటర్వ్యూలతో ప్రేక్షకులకు మరింత చేరువవుతోంది. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన నాగదుర్గ, తనకు బిగ్ బాస్ తెలుగు నుంచి ఆఫర్ వచ్చిన మాట నిజమేనని వెల్లడించింది. అయితే తాను ఆ షోకు సరిపోనని భావించి ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించినట్లు చెప్పింది.నాకు భయం అనేది లేదు. కానీ బిగ్‌బాస్ షోకు నేను సెట్ కాను అనిపించింది. నేను చాలా సైలెంట్‌గా ఉంటాను. మొహమాటం ఎక్కువ. ఎవరికైనా ‘నో’ చెప్పాలన్నా చాలా ఇబ్బంది పడతాను. నా భావాల కంటే ఎదుటివారి భావాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాను. అదే కొన్ని సందర్భాల్లో నాకు సమస్యగా మారుతుంది. కొన్నిసార్లు ఎదుటివారిని బాధ పెట్టకూడదనే ఆలోచనతో నేనే బాధపడుతూ ఏడ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి” అని నాగదుర్గ చెప్పింది. బిగ్‌బాస్ ఆఫర్ వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన సలహాల గురించి కూడా నాగదుర్గ ఆసక్తికర విషయాలు పంచుకుంది.

# నా అలవాటు మార్చుకోను

ఎన్ఐఏ ఏజెంట్ వైష్ణవిగా ‘స్పై’ సినిమాతో తెలుగు చిత్రసీమకు పరిచయమైన నటి ఐశ్వర్య మేనన్. ఆ తరువాత ‘భజే వాయు వేగమ్’తో మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ రెండు చిత్రాలూ ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా.. తనకంటూ ఫ్యాన్ ఫాలో యింగ్ పెంచుకున్నది ఈ భామ. ఒకవైపు కన్నడ, తమిళ్, మలయాళ సినిమాల్లో నటిస్తూనే మరోవైపు టాలీవుడ్ లోనూ పాగావేసిన ఈ ముద్దుగుమ్మ ఈసారి ‘నాగబంధం’తో రంగంలోకి దిగింది. ఈ సందర్భంగా ఆమె పంచుకున్న కార్వాన్ కబుర్లు ఇవి. మాది వాస్తవానికి కేరళం రాష్ట్రం. కొన్ని కారణాల వల్ల తమిళనాడులోని ఈరోడ్‌కు వలసొచ్చి అక్కడే స్థిరపడ్డాం. దీంతో నా బాల్యమంతా తమిళనాడులోనే గడిచింది. బీటెక్ వరకు చదువుకున్న నాకు సినిమాల్లో నటించాలనే బలమైన కోరిక ఉండేది. ఆ ఆసక్తితోనే అవకాశాల కోసం ప్రయత్నించి కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చాను. నాకు సంతోషం వచ్చినా, బాధ కలిగినా సోషల్‌మీడియాలో వ్యక్తం చేయడం అలవాటు. బాధకంటే ఆనందాన్నే ఎక్కువగా పంచుకుంటాను. ఓ సందర్భంలో నా ఫొటోల ను పోస్ట్ చేయగా.. సినిమా ఆఫర్ల కోసం ఇలాంటి ఫొటోలు పోస్ట్ చేస్తుందని చాలామంది బ్యాడ్ కామెంట్లతో విమర్శిం చారు. నన్ను ద్వేషించేవారికి నేను చెప్పేది ఒక్కటే. మీరు ఎగతాళి చేసినా, విమర్శించినా ఒకరికోసం నా అలవా టును మార్చుకోను. ఇతర భాషల్లో చేస్తున్న సినిమాలు మంచి ఆదరణకు నోచుకుంటున్నాయి. అందుకే తెలుగులోనూ నా టాలెంట్‌ను నిరూపించు కునేందుకు వచ్చాను. గతంలో నేను నటించిన రెండు టాలీవుడ్ సినిమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపో యాయి. అయినా కూడా ఇక్కడ నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తునే ఉన్నాను. విజయానికి ముందు ఓటమి ఎదురవు తుందంటారు కదా. ఆ పాలసీనే నేను ఫాలో అవుతున్నా. కచ్చితంగా సక్సెస్ అవుతా. ‘నాగబం ధం’ ప్రేక్షకులను సరికొత్త ఆధ్యాత్మిక, అడ్వెంచర్ ప్రపంచంలోకి తీసుకెళ్లేలా రూపొందిన సినిమా. అనంత పద్మనాభస్వామి ఆలయం, అక్కడి నాగబంధం రహస్యాల కాన్సెప్ట్ ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. విరాట్ కర్ణ, నభా నటేశ్‌లతో కలిసి సినిమాలో నటించడం కొత్త అనుభూతినిచ్చింది. నా అభిమాన నటుడు మలయాళం మెగాస్టార్ మమ్ముట్టి గారే. ఆయనతో ఒక్కసారైనా నటించాలనే కోరిక ఉండేది. ఆ అవకాశం అంత త్వరగా వస్తుందని అస్సలు ఊహించలేదు. ఆయనతో కలిసి నటించడాన్ని నేను ఎన్నటికీ మరిచిపోలేను. మమ్ముట్టి నటించిన బజూకా సినిమాలో నేను కీలకపాత్ర పోషిం చాను. ఈ చిత్రంలో నా నటనకు మంచి మార్కులే పడ్డాయి.

# రోజూ వేధించేవారు..

## చివరకు రాయి విసిరా .. స్కూల్ రోజుల్లో ఎదురైన చేదు అనుభవం



యువ నటి కయాదు లోహర్ తన స్కూల్ రోజుల్లో ఎదుర్కొన్న వేధింపుల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. పదో తరగతి చదువుతున్న సమయంలో కొందరు యువకుల వేధింపులను ఎదుర్కొన్నానని, ఒక దశలో సహనం కోల్పోయి ఆవేశంతో రాయి విసిరిన సంఘటన ఇప్పటికీ గుర్తుందని ఆమె చెప్పుకొచ్చారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కయాదు లోహర్, తాను పదో తరగతి చదువుతున్న రోజుల్లో ఇంటికి సమీపంలో ఉన్న ట్యూషన్‌కు వెళ్లేదాన్నని తెలిపారు. ఆ మార్గంలో ప్రతిరోజూ కొందరు అబ్బాయిలు తనను వేధించేవారని చెప్పారు. మొదటి రోజు వాటిని పట్టించుకోలేదని, రెండో రోజు కూడా మౌనంగానే వెళ్లిపోయానని, కానీ మూడో రోజు మాత్రం పరిస్థితి భరించలేకపోయా నని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ రోజు తీవ్ర కోపంతో రోడ్డుపై ఉన్న రాయిని తీసుకుని వారివైపు విసిరినట్లు కయాదు తెలిపారు. ఆ రాయి ఒక యువకుడి తలకు తగలడంతో అతడికి గాయమై రక్తస్రావం జరిగిందని చెప్పారు. ఆ ఘటన తర్వాత తాను అక్కడి నుంచి వెళ్లిపోయానని, తర్వాత ఏమైందో తనకు తెలియదని పేర్కొన్నారు. ఆ సమయంలో కోపం, భయం, నిస్సహాయత కలిసి తనను అలా స్పందించేలా చేశాయని వివరించారు. ఆ సంఘటనను ఇప్పుడు తిరిగి గుర్తు చేసుకుంటే, ఎవరినైనా గాయపరచడం సరైన పద్ధతి కాదని కయాదు అంగీకరించారు. హింస ఎప్పుడూ పరిష్కారం కాదని చెప్పిన ఆమె, అయితే అప్పటి పరిస్థితుల్లో తనకు ఎదురైన వేధింపులు, మానసిక ఒత్తిడి కారణంగానే అలా ప్రవర్తించాల్సి వచ్చిందని తెలిపారు. సాధారణంగా తాను ప్రశాంత స్వభావం కలిగిన వ్యక్తినని, కానీ ఎవరైనా తప్పు చేస్తే దానిని మౌనంగా భరించడం కూడా సరికాదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కయాదు లోహర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహిళలు, విద్యార్థినులు విద్యాసంస్థలకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఎదుర్కొనే వేధింపుల సమస్యపై మరోసారి చర్చ మొదలైంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు మరింత బలోపేతం కావాలని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు

ప్రస్తుతం కయాదు లోహర్ పలు భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఆమె నటించిన ‘ఇధయమ్ మురళి’ జూలై 10న విడుదల కానుండగా, ‘ఇమ్మోర్టల్’ జూలై 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ‘ఐ యామ్ గేమ్’, ‘ఖలీఫా’, ‘ది ప్యారడైజ్’ వంటి చిత్రాలతో పాటు హీరో సూర్య నటిస్తున్న మరో చిత్రంలోనూ ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. న్నారు.